సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ఎన్నాళ్లీ అవస్థలు..?

- ములగాడ సర్వీస్ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం
- ఒకవైపు గుంతలు.. మరోవైపు తవ్వకాలు
- ఇబ్బందులు తొలగించాలని వాహన చోదకుల విజ్ఞప్తి



ములగాడ సర్వీస్ రోడ్డు నిలిచిన వాహనాలు



ములగాడ సర్వీస్ రోడ్డులో ఓ వైపు తవ్విన గోతులు



ములగాడ - శ్రావణి షిప్పింగ్ మార్గంలో అడ్డంగా పెట్టిన కేబుల్ బండిల్స్

మల్కాపురం: నాడు ప్రశాంత వాతావరణానికి నిలయమైన ఆ గ్రామం.. నేడు పెద్ద పెద్ద వాహనాల రాకపోకలు, హారన్ శబ్దాలతో మార్మోగుతోంది. ఈ సమస్య ఇలా ఉంటే.. ఈ గ్రామంలోని బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకల సమయంలో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్టు ఇప్పుడు మరో కొత్త సమస్య ఈ ప్రాంతంలో నెలకొంది. వైర్లు అమర్చేందుకు ఇక్కడి సర్వీస్ రోడ్డులో ఒకవైపు గుంతలు తవ్వడంతో నిత్యం వాహన చోదకులు నరకయాతన చూస్తున్నారు. జీవీఎంసీ 58వ వార్డు శివారు గ్రామం ములగాడలో ప్రస్తుత పరిస్థితి ఇది.

వాహన చోదకుల తంటాలు

ఒకప్పుడు చాలా ప్రశాంతమైన ములగాడ గ్రామం.. ఇప్పుడు కొత్త సమస్యల్లో చిక్కుకుంది. డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెనను మూసి వేయడంతో సింధియా నుంచి జింక్ వరకు గల పలువురు వాహన చోదకులు నగరానికి, గోపాలపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ములగాడ సర్వీస్ రోడ్డు నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్ దాటుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం నాలుగేళ్లుగా గుంతలమయంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు భూగర్భంలో విద్యుత్ కేబుళ్లు వేసేందుకు నాలుగు రోజులుగా ములగాడ సర్వీస్ రోడ్డులో ఓ వైపు తవ్వకాలు జరుపుతున్నారు. వైర్లు అమర్చేందుకు తవ్విన గోతుల నుంచి తీసిన మట్టిని సర్వీస్ రోడ్డు వద్దే నిర్లక్ష్యంగా ఉంచేశారు. అసలే గోతుల మార్గం.. దీనికితోడు తవ్విన మట్టి మరింత అడ్డంగా మారడంతో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గానికి పోర్టు అధికారులు రూ.25 లక్షలతో మరమత్తులు చేపడతామన్నారు. ఆ పనులు పేరుకు ప్రారంభమైనా.. వర్షాలు, ఇతర కారణాల వల్ల మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఈ రహదారికి ఎప్పుడు మోక్షం కలుగుతుందా..., ఎన్నాళ్లీ అవస్థలు పడాలని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



విధులకు రోజూ ద్విచక్ర వాహనంపై ములగాడ - శ్రావణి షిప్పింగ్ మార్గంలో వెళ్తున్నాను. ఈ రహదారి పూర్తిగా గుంతలతో నిండి ఉంది. విద్యుత్ కేబుల్ పనులు జరుగుతుండటంతో రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈ మార్గానికి ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– నర్సింగ్‌రావు, వాహన చోదకుడు

అధికారులు స్పందించాలి



డాక్‌యార్డ్ వంతెన మూసేయడంతో ములగాడ సర్వీస్ రోడ్డు నుంచి నగరానికి రోజు వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గం పూర్తిగా గుంతలు, విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం తవ్విన గోతులతో మరింత ఇరుగ్గా మారింది. రాకపోకల సమయంలో చాలా అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– శంకరరావు, ములగాడ

నిజాయితీగా మెలగాలి



పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం

మల్కాపురం: నిజాయితీ గల మనిషిని ఈ సమాజం ఎప్పుడూ గౌరవిస్తుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయనకు కళాశాల యాజమాన్యం, సీనియర్ అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిజాయితీగా మెలగాలని హితవు పలికారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులందరూ అడుగులు వేయాలని, దీనిపై ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. ఒక అవినీతి పరుడి వల్ల తన కుటుంబంతోపాటు, ఊరు ఎంతో నష్టపోతుందని, ఒకరి నిజాయితీ తన గ్రామానికి, తల్లిదండ్రులకు ఎంతో కీర్తిని తెచ్చిపెడుతుందని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం కమిషనర్‌కు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ కాళీదాసు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 52వ వార్డు అధ్యక్షుడిగా జియ్యాని మారుతేశ్వరరావు



గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ 52వ వార్డు అధ్యక్షుడిగా జియ్యాని మారుతేశ్వరరావును నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి నియామక ఆదేశాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మారుతేశ్వరరావు మాట్లాడుతూ వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు పలువురు అభినందించారు.

క్లుప్తంగా

సబ్జీ కూలర్ ఉపయోగాలపై అవగాహన



సబ్జీ కూలర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌వో సోని

గోపాలపట్నం: సబ్జీ కూలర్ల ఉపయోగాలను రైతులంతా తెలుసుకోవాలని ఉద్యానవనం అధికారి సోని సూచించారు. గోపాలపట్నం రైతుబజారులో శనివారం రైతులకు సబ్జీ కూలర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇవి విద్యుత్ వినియోగం లేకుండా సులువుగా పనిచేస్తాయని వివరించారు. అక్టోబర్ 10లోగా రైతులంతా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలు, విత్తనాలు, పంటలకు వచ్చే చీడ పీడలపై రైతులకు అవగాహన కల్పించారు. వివరాలకు రైతులు ఉద్యానవన శాఖ అధికారులను, రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, సహాయకుడు శివ, శ్రీనాధు పాల్గొన్నారు.

నర్సుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో డాక్టర్ వాసవీలత, డాక్టర్ శ్రీహరి

మహారాణిపేట: నర్సుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కేజీహెచ్‌లో నిర్వహించారు. 1976–79 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓపీఎల్ కుమారి, ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి, నర్సుల సంఘం నాయకురాళ్లు బూతం భాగ్యలక్ష్మి, డి.లక్ష్మి, సుమిత్ర, పుట్టు రాణి, కళావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం కాకుండా కాపాడాలి



ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం కాకుండా కాపాడాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. ఈవోఐ, నక్కపల్లి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా శనివారం అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద స్టీల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్యాకేజీ ప్రకటించామని ప్రజలను మభ్య పెట్టి మరోవైపు ఆపరేషన్‌లో కాంట్రాక్ట్ జోక్యానికి అవకాశం కల్పిస్తూ 46 ఈవోఐలు జారీ చేశారన్నారు. తద్వారా విశాఖ ఉక్కు.. కాంట్రాక్టర్ల హక్కుగా మారిపోతుందన్నారు. ప్లాంట్ ప్రైవేటీరణ జరగదని పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ సమర్థవంతమైన యాజమాన్యాన్ని నియమించే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ మిట్టల్ ప్లాంట్ ఏర్పాటు, ఈవోఐలకు వ్యతిరేకంగా ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

సౌభాగ్యదాయిని.. ఐశ్వర్యప్రదాయిని



విశేష అలంకరణలో అమ్మవారు



కొత్తపాలెంలో లక్ష్మీదేవిగా దుర్గాదేవి.. రూ.1.80 లక్షలతో అలంకరణ



జయప్రకాష్‌నగర్‌లో లలితా త్రిపురసుందరి అవతారంలో దుర్గాదేవి



మల్కాపురం గొల్లవీధి మండపంలో లలితా త్రిపురసుందరిగా ..



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల ఆలయంలో అమ్మవారికి పదివేల గాజులతో అర్చన



కొత్తపాలెం నాగేంద్ర కాలనీలో ఆకట్టుకుంటున్న దేవీ మండపం



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



శంకర సినిమా హాల్ దరి మండపం వద్ద చిన్నారుల కోలాట ప్రదర్శన

గోపాలపట్నం: శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వాడవాడలా కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పలు మండపాలు, ఆలయాల్లో అమ్మవారిని ఐదోరోజు లలితా త్రిపుర సుందరిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. లలితా సహస్రనామావళిని పఠించారు. పలు మండపాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

లక్ష్మీదేవికి రూ.1.80 లక్షల కరెన్సీతో అలంకరణ

కొత్తపాలెం కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. 1 లక్ష 80 వేల రూపాయలతో అమ్మవారిని అలంకరించారు. రూ.10, 20, 50, 100, 200, 500 నోట్లతో అమ్మవారి నిలువెత్తు విగ్రహాన్ని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. గోపాలపట్నం శంకర సినిమా హాల్ వద్ద దుర్గాదేవి మండపం ప్రాంగణంలో చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది.

పదివేల గాజులతో అర్చన

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఆలయంలో దుర్గాదేవిని లలితాత్రిపురసుందరిగా అలంకరించి, పదివేల గాజులతో అర్చించారు. దానిమ్మ పండ్లు, చక్కెరపొంగలి నివేదించారు. అమ్మవారి మందిరం ముందు పెద్ద ఎత్తున దీపారాధన నిర్వహించారు.

- 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారి సన్నిధిలో పది వేల ఒక్క ప్రమిదలతో దీపాలను వెలిగించారు. భవానీ భక్తులు అమ్మవారి కీర్తనలు ఆలపించారు.
- మల్కాపురం గొల్లవీధి వద్ద అల్లరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావుయాదవ్ పాల్గొన్నారు.

దుర్గాదేవికి విశేష పూజలు



పల్లి వీధిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న సీఐ గొలగాని అప్పారావు యాదవ్

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 61వ వార్డు మల్కాపురం పల్లి వీధిలో విజయ బాలమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా త్రిపురసుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి సీఐ పండ్లు, వస్త్రాలు సమర్పించి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆయనను కళా సమితి ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కళా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యం పదిలం



దంత వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యురాలు



ఆస్పత్రి ప్రాంగణంలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుజాత

గోపాలపట్నం: మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. జీవనశైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే అనారోగ్యం దరి చేరదని సూచించారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ (ఓరల్, బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్) పరీక్షలు చేశారు. వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. దంత పరీక్షలు, బీపీ, షుగర్, టీబీ పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని తెలిపారు. వ్యాయామం, ఉదయాన్నే వాకింగ్ వంటివి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రొటీన్ శాతం ఎక్కువ ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని.. రొమ్ములో కాయలు, గెడ్డల మాదిరిగా ఉన్నట్లు గుర్తిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భాశయ క్యాన్సర్ విషయంలో అశ్రద్ధ వహించవద్దని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, సిబ్బంది, అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.
- 89వ వార్డు కొత్తపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ నాయుడు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.